ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

- అవసరమైన చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం
- ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ



ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు.శుక్రవారం కొండాపూర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కోసం వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీహబ్, హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ వంటి ప్రాంతాలతో రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు కేటాయింపు జరుగుతోందన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా శేరిలింగంపల్లిలో ఫ్లైఓవర్లను నిర్మించామన్నారు. ఫ్లైఓవర్ల నిర్మాణ సమయంలో వాహనదారులకు ఇక్కట్లు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన పనులతో శేరిలింగంపల్లిలో ట్రాఫిక్ సమస్యలన్నీ దాదాపు తీరుతున్నాయన్నారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లే కాకుండా నగరంలోనే అత్యధికంగా లింకురోడ్ల నిర్మాణం కూడా శేరిలింగంపల్లిలో ఉన్నాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో అన్ని నిర్మాణాలు, రోడ్ల విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్ఈ వెంకటరమణ, ఈఈ నామ్య, డీఈ హరీష్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, స్ట్రీట్ లైట్స్ ఈఈ ఇంద్రదీప్ పాల్గొన్నారు.

దళితుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట



దళితబంధు యూనిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: దళితుల అర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామానికి చెందిన ఆరుగురికి దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గవ్యాప్తంగా మూడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 100 మంది లబ్ధిదారులకు రూ.10లక్షల విలువైన యూనిట్లను అందజేసినట్లు తెలిపారు. యూనిట్లు పొందిన లబ్ధిదారులందరూ విజయవంతంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ బిక్షపతి, ఎంపీడీఓ బన్సీలాల్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపు ఖాయం



గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌లో ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను స్వయంగా కలుస్తూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో ప్రజలనుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, వివిధమోర్చాల రాష్ట్ర, జిల్లా, శేరిలింగంపల్లి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

మియాపూర్: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీకి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న మియాపూర్ నరెన్ గార్డెన్‌లో జరగబోయే శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 45, కాకర 50, దొండ 25, దోస 35, ఆలు 25, చామ 70, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



గచ్చిబౌలి: కొండాపూర్ శ్రీరాంనగర్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ , పాఠశాల డైరెక్టర్ పెరుకభార్గవి, ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

స్వదేశీ వస్త్రప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్‌గ్యాలరీలో శుక్రవారం స్వదేశీ పేరిట వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో వస్త్రాలు, ఫ్యాబ్రిక్స్ , గృహాలంకరణ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటల నుండి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

గచ్చిబౌలి: ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తోందని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు.సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.3.43 లక్షల చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా పనిచేస్తుంద న్నారు. ఆర్థిక స్తోమత లేని అన్ని వర్గాల పేద, మధ్యతరగతి వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తోందన్నారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 17 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 16 మందికి చేసినట్లు వెల్లడించారు.

సందడి చేసిన విద్యార్థులు



మియాపూర్ : మదీనాగూడలోని కెనరీ ద స్కూల్‌లో ఎర్త్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఎర్త్ డే మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సేవ్ ఎలక్ట్రిసిటీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శ్వేతారెడ్డి హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి

పటాన్‌చెరు టౌన్: గురుకుల ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతి తెలంగాణ గురుకుల ప్రవేశానికి ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్, ఈ-వేస్ట్‌పై వర్క్‌షాప్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ప్లాస్టిక్, ఈ–వేస్ట్‌పై శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ వైస్ ప్రిన్సిపాల్ డా. జీవీ నరసింహారెడ్డి, గౌరవ అతిథులుగా అరబింద్ కుమార్, డా. బాలనర్సయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డా. తిరుమలచారి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన పలువురు వక్తలు ప్లాస్టిక్, ఈ–వేస్టు అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

‘గీతం’ను సందర్శించిన అరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులు



విద్యార్థులకు వివరిస్తున్న ప్రొఫెసర్ బ్రెట్ డ్వార్లే

పటాన్‌చెరు టౌన్: అమెరికాలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ (ఏఎసియూ)కి చెందిన ఇద్దరు ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్ లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వీరిలో ఒకరు డబ్ల్యూపీ కారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ క్లినికల్ అసోసియేట్ ప్రొఫెసర్ బ్రెట్ డ్వార్లే, మరొకరు స్కాలర్ల కేంద్రం అసోసియేట్ వెస్ట్ ప్రెసిడెంట్ హోలీ సింగ్. వీరు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్‌లోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. పరస్పరం సహాయ సహకారాలు అందించుకోగల ప్రాంతాలు, ముఖ్యంగా శిక్షణ, పరిశోధనా సహకారం, గీతం విద్యార్థులకు ఫీజులో మినహాయింపు వంటి అంశాలపై ప్రాథమికంగా చర్చించారు.

మాజీ కార్పొరేటర్‌కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు



కొమిరిశెట్టి సాయిబాబాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, సన్నిహితులు తీసుకొచ్చిన కేక్‌లను కట్ చేసి అందరికీ అందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ వార్డు కమిటీ సభ్యులు దారుగుపల్లినరేష్, స్నేహితులు పాల్గొన్నారు.

త్వరగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని వినతి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రాంతానికి చెందిన రైతు కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ తహసీల్దార్, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు కోరని బాల్‌రాజ్, కోరని సదానంద్‌లు మాట్లాడుతూ.. బుద్వేల్ సర్వే నెంబర్ 282 నుంచి 299 వరకు ఉన్న స్థలంలో 66 మంది పట్టాదారులకు ప్రభుత్వం 800 గజాల చొప్పున స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిందన్నారు. గతంలో 66 కుటుంబాలకు చెందిన సభ్యులు బుద్వేల్‌లోని 281 ఎకరాల భూమిని సాగు చేసేవారన్నారు. ప్రభుత్వం ఈ భూములను వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం తీసుకుందన్నారు. ఈ విషయమై 18 ఏళ్లుగా పోరాటం చేసినా.. ప్రతి రైతు కుటుంబానికి 800 గజాల స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ స్థలాన్ని త్వరగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అప్పగించాలన్నారు. శుక్రవారం తహసీల్దార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి కోరామన్నారు. యాదయ్య, కుమార్, సన్నీ, అనంతయ్య తదితరులున్నారు.

జీఓ.58, 59 అర్హులకు పట్టాలు అందజేత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలంలోని కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలో జీఓ.58, 59కి దరఖాస్తు చేస్తుకున్న వారికి ప్రభుత్వం యాజమాన్య హక్కు కల్పిస్తోందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సర్వే అనంతరం అర్హులైన వారికి శుక్రవారం తహసీల్దార్ గోవర్ధన్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఆయన పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, సమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్ రావు, కాశీనాథ్‌యాదవ్, అనిల్, హరినాథ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యా భవన్స్ విద్యార్థుల వాటర్ క్యాంప్





పటాన్‌చెరు: ధరిత్రి దినోత్సవం సందర్భంగా బీహెచ్‌ఈఎల్ రామచంద్రాపురంలోని భారతీయ విద్యా భవన్స్ పాఠశాల నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో వాటర్ క్యాంపు నిర్వహించారు. వేసవి సమయంలో గొంతు ఎండుతున్న వారికి ఒక గ్లాస్ మంచినీళ్లు ప్రాణం పోస్తాయి. అందులో భాగంగానే ఈ వాటర్ క్యాంపు నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందిస్తాం

రామచంద్రపురం (పటాన్‌చెరు): ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ పరిధిలోని వార్డులలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ. 25 కోట్ల వ్యయంతో 22 కిలోమీటర్ల మేరకు వేస్తున్న నూతన పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని వివరించారు. తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని కాలనీల్లోని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పనగేశ్‌యాదవ్ అన్నారు,. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో శుక్రవారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కాలనీలో ఉన్న సమస్యలను ప్రజలను అ డిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమీషనర్ బాలయ్య, నాయకులు బూరుగుగడ్డ నగేష్, కాలనీ అధ్యక్షులు శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

మియాపూర్: అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ రఘు తెలిపిన మేరకు.. శేరిలింగంపల్లిలోని గుల్‌మోహర్ పార్కు కాలనీలో నివాసముంటున్న చాగూరి సునీల్ (64) కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులతో గొడవల కారణంగా గత 20 సంవత్సరాలుగా ఒక్కడే ఇక్కడ ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత మూడు రోజుల నుండి సునీల్ ఇంట్లో నుండి బయటికి రాకపోవడంతో ఇంటి యాజమాని రాజు, స్థానికులు ఇల్లు తెరిచి చూడగా సునీల్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా సునీల్ మృతి చెందినట్లు గుర్తించారు. సునీల్ మరణించి ఒక రోజు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇంటి యాజమాని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మియాపూర్: జాతీయ రహదారి పై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శేరిలింగంపల్లిలోని పాపిరెడ్డి కాలనీ రాజీవ్ గృహ కల్పలో నివాసముంటున్న షేక్ మౌలానా(72) శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో నిజాంపేట్‌లో పని ఉందని ఇంటి నుండి బయలుదేరారు. తన కుమారుడు షేక్ కమురుద్దీన్ ఆటోలో గంగారం జాతీయ రహదారి పై విడిచి వెళ్లాడు. నిజాంపేట్ వెళ్లేందుకు షేక్ మౌలానా హుడా కాలనీ వైపు నుండి ఆర్‌ఎస్ బ్రదర్స్ వైపు రోడ్డు దాటుతుండగా చందానగర్ నుండి మియాపూర్ వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చూసి తన కుమారుడు కమురుద్దీన్ ఫోన్ చేసి తెలిపారు. దీంతో కుమారుడు సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ వాహనంలో తండ్రి మౌలానాను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 10 గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కుమారుడు కమురుద్దీన్ చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతురాలు కవిత

గచ్చిబౌలి: తాను నివాసముంటున్న ప్రాంతంలో ఓ వ్యక్తి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాధాకృష్ణ తెలిపిన మేరకు.. గౌలిదొడ్డిలోని బసవతారకనగర్‌బస్తీ లోని గుడిసెల్లో బి.కవిత(31) తన ఇద్దరు కుమారులు పప్పు(9), బన్నీ(7)తో కలిసి నివాసముంటోంది. ఆమె హౌజ్‌కీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం తెల్లవారు జామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం 7.30 గంటలకు స్థానికులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. స్థానికంగా నివాసముంటున్న ‘ఎల్లేష్ అనే వ్యక్తి నిత్యం వేధింపులకు పాల్పడుతున్నాడని..బతకాలనీ ఉన్నా చనిపోతున్నానని’ సూసైడ్ నోట్ రాసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం తర్వాత బంధువులకు అప్పగించారు.

సీబీఐటీలో ఆవిష్కరణ దినోత్సవం



మణికొండ: ప్రపంచ ఆవిష్కరణ, సృజనాత్మకత దినోత్సవాన్ని సీబీఐటీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఏప్రిల్ 21న ప్రపంచ ఆవిష్కరణ, సృజనాత్మకత దినోత్సవాన్ని నిర్వహిస్తుంటామన్నారు. సమస్య పరిష్కారంలో సృజనాత్మకత, ఆవిష్కరణల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచటం, ఆలోచనలను ప్రోత్సహించటం ఈ రోజు ముఖ్య లక్ష్యమన్నారు. ఏసీఐసీ–సీబీఐటీ, ఏఐసీ, ఐఐఐటీ హైదరాబాద్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయన్నారు. వివిధ రకాల ఇన్నోవేషన్ టాక్స్ ద్వారా విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. అశోక్, చంద్రశేఖర్, ఉదయభాస్కర్, సూరజ్, మొయ్యార్, డాక్టర్ శ్రీనివాస్‌లు తమ ఆవిష్కరణల్లో ఎదురైన సవాళ్ల గురించి వివరించారు. రవిశంకర్, అబ్దుల్, అతీక్ హుస్సేన్, వైష్ణవిరెడ్డి తదితరులున్నారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన



కేపీహెచ్‌బీకాలనీ: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం ఏఈ సాయిప్రసాద్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాల పూడికను ఇప్పటి నుంచే తీసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వరదనీరు వెళ్లడానికి అడ్డంకులు తొలుగుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే 3వ ఫేజ్ మహిళా పార్కు వెనకాల నాలా పూడికతీత పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.